5న తిరుపతమ్మ వారి కల్యాణం

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామ శివారు అద్దంకి బ్రాంచ్ కెనాల్ వద్ద వేంచేసియున్న గోపయ్య సమేత శ్రీలక్ష్మి తిరుపతమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవాలు ఆదివారం ఉదయం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ధర్మకర్త గోనుగుంట్ల వెంకట్రావు గురువారం తెలిపారు.

ప్రశాంత జీవన విధానమే లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి
- తొమ్మిదో వార్డులో మూడోరోజు గడప గడపకు మన ప్రభుత్వం



లబ్ధిదారులకు వివరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: నియోజకవర్గంలో ప్రజల ప్రశాంతమైన జీవన విధానం తమ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. డాక్టర్ కోడెల శివప్రసాద రావు నియోజకవర్గాన్ని విడిచి వెళ్లిన తర్వాత ఏర్పడిన ప్రశాంతతను తాము కాపాడుతున్నామని చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం మూడోరోజు తొమ్మిదో వార్డులో పర్యటించారు. పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యేకు వార్డు మాజీ కౌన్సిలర్ పాలపర్తి వెంకటేశ్వరరావు, కన్వీనర్లు గాలంకోటేశ్వరరావు, వెన్నపూస జోసెఫ్‌రెడ్డి, న్యాయవాది సింధుకూరి శ్రీనివాసరావు, షేక్ చాంద్ బాషా ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. పురపాలక నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును కొబ్బరికాయ కొట్టి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ రొంపిచర్ల మండలం అలవాల గ్రామంలో జరిగిన కాల్పుల సంఘటన టీడీపీలోని అంతర్గత పోరుకు సాక్ష్యమన్నారు. పట్టణంలో ఏ వార్డులో లేని విధంగా ఈ వార్డులో రూ.3.37 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేశామన్నారు. కార్యక్రమంలో ముతరాసు కార్పొరేషన్ డైరెక్టర్ ఇయంస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మోరబోయిన శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగ రాష్ట్ర కార్యదర్శి పాలపర్తి సామ్రాజ్యం, నరసరావుపేట చాంబర్ అధ్యక్షులు చీతిరాల గురుపెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు ఫిట్‌గా ఉండాలి

నరసరావుపేట: డ్రైవర్లు మద్యం, ధూమపానంకు దూరంగా ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఫిట్‌గా ఉండాలని జిల్లా రవాణా శాఖ అధికారి టి.పరంధామరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆర్టీసీ డిపో గ్యారేజ్‌లో నిర్వహించిన రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆర్టీవో, డీఎస్పీ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సభకు ఆర్టీసీ పీడీటీ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్.శ్రీనివాసరావు అధ్యక్షులుగా వ్యవహరించారు. డీఎస్పీ సి.విజయభాస్కర్‌రావు మాట్లాడుతూ డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ ప్రమాదాలు నివారించాలని కోరారు. టుటౌన్ సీఐ అశోక్‌కుమార్, డెప్యూటీ సీఎంఇ ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఉత్తమ ప్రమా ద రహిత డ్రైవర్లకు సన్మానం, ప్రశంసా పత్రాలను అందజేశారు. సభను డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి ప్రారంభించగా, జిల్లాలోని ఆరు డిపోల మేనేజర్లు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మినుములో కొత్తరకం వంగడాల సాగు

ఈపూరు: చిరు సంచులను ప్రయోగాత్మకంగా సాగు చేయుట ద్వారా కొత్త రకాలను అందుబాటులోకి తీసుకొని రావడం జరుగుతుందని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.నగేష్ తెలిపారు. మండలంలోని కొచ్చర్ల గ్రామంలో గోలి అంకారావు, గోలి రత్తయ్య పొలాల్లో సాగు చిరు సంచులు (మినీ కిట్స్) మినుము పంటలో కొత్త రకాలైన ఎల్‌బీజీ 932, ఎల్‌బీజీ 752 సాగును శాస్త్రవేత్తలు ఎం.నగేష్, సీహెచ్. శ్రీలతవాణి, డాట్ సెంటర్ కోఆర్డినేటర్ జి. కిషోర్‌లు పరిశీలించారు.

ఉద్యోగాలకు 26 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జయకృష్ణ

నరసరావుపేట రూరల్: ఏఎం రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 26 మంది ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. జయకృష్ణ తెలిపారు. చెన్నైకి చెందిన తింక్సింక్ కంపెనీ ప్రతినిధులు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలకు కళాశాలకు చెందిన 107 మంది విద్యార్థులు హాజరయ్యారు. రాత పరీక్ష, హెచ్‌ఆర్ రౌండ్, ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహించి 26 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్టు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు రూ.2.9 లక్షల వార్షిక వేతనం అందిస్తారని వివరించారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ అట్లూరి శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి అట్లూరి శాంతి, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

87 శాతం పింఛన్ల పంపిణీ

నాదెండ్ల: మండలంలో వైఎస్సార్ పెన్షన్ కానుక- సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ గురువారం 87 శాతం పూర్తయింది. మండల పరిధిలో 9383 మంది లబ్దిదారులకు గాను రూ.2,58,58,500లు పింఛను పంపిణీ చేయాల్సి ఉంది. రెండోరోజు 87 శాతం పంపిణీ చేశారు. తెల్లవారుజామున వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను పంపిణీ చేశారు.

ఫ్యాక్షన్ సంస్కృతి టీడీపీదే

రొంపిచర్ల: తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు వెన్నా బాలకోటిరెడ్డిపై జరిగిన కాల్పులకు తనకు ఎలాంటి సంబంధం లేదని వైఎస్సార్ సీపీకి చెందిన మాజీ ఎంపీటీసీ, ప్రస్తుత ఎంపీపీ భర్త గడ్డం వెంకట్రావు పేర్కొన్నారు. గ్రామంలో ఉన్న తెలుగుదేశం పార్టీలో ఉన్న వర్గపోరు, కుటుంబ వ్యవహారాలకు సంబంధించి ఈ దాడి జరిగిందన్నారు. టీడీపీ నాయకులు డాక్టర్ అరవిందబాబు, తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అలజడులు సృష్టించడం, ఫ్యాక్షన్ రాజకీయాలు చేయడం టీడీపీ పార్టీకే చెల్లుతుందన్నారు.

కొండవీడుకోటలో వసతుల కల్పనే లక్ష్యం

జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.రామచంద్రరావు

యడ్లపాడు: పర్యాటకుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వాటికి అనుగుణంగా కొండవీడు కోటలో సౌకర్యాలను అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.రామచంద్రరావు చెప్పారు. కొండవీడుకోటను గురువారం ఆయన సందర్శించారు. కొండపైన అటవీశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న నగరవనం అభివృద్ధి పనులను సిబ్బందితో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం కొండవీడు-నగరవనం కార్యక్రమం ద్వారా కొండపైన సందర్శకుల కోసం తాగునీటి సదుపాయం, మరుగుదొడ్ల ఏర్పాటు, బొగన్విల్లియా, గోల్డెన్ దారంతో మొక్కలతో పచ్చదనం పెంపొందించడం, వేమన మండపంలోని ఫ్లోరింగ్ పనులను సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఆయా పనుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ డి.వెంకటరమణ, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పి.నీలిమాదేవి, ఫారెస్టు బీట్ ఆఫీసర్ షేక్ అమీర్‌జానీబాష ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో కార్మికులకు మొండిచేయి

నరసరావుపేట ఈస్ట్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మికులకు, రైతాంగానికి మొండిచేయి చూపిందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు గురువారం విమర్శించారు. పేద బడుగు, బలహీన వర్గాలకు బడ్జెట్ ద్వారా ఒరిగేదేమి లేదని తెలిపారు.

షూటింగ్ బాల్‌లో గోల్డ్‌మెడల్

నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన 41వ సీనియర్ ఉమెన్ షూటింగ్ బాల్ అంతర్ జిల్లాల ఆటల పోటీలలో విట్ ఆక్స్‌ఫర్డ్ కళాశాల విద్యార్థిని షేక్.ఛాందిని బంగారు పతకం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ శివాజీ గురువారం తెలిపారు. షూటింగ్ బాల్ పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి జట్టు విజయంలో కీలకపాత్ర వహించిన ఛాందినీని కళాశాల డైరెక్టర్లు చిలకల రాజారెడ్డి, కె.సాంబశివరావు, దోగిపర్తి శ్రీనివాసరావు, అధ్యాపకులు అభినందించారు.

రీసర్వే పనులు వేగవంతం చేయాలి

ఈపూరు: మండలంలోని కొండ్రముట్ల గ్రామ సచివాలయాన్ని తహసీల్దార్ విజయజ్యోతికుమారి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సచివాలయ రికార్డులను పరిశీలించి సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం రీసర్వే ప్రక్రియను ఆమె పరిశీలించి సర్వే ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయడానికి తగు సూచనలు చేశారు.



ఎరువుల దుకాణాలలో తనిఖీలు

నరసరావుపేట రూరల్: పట్టణంలోని ఎరువుల దుకాణాలు, గిడ్డంగుల్లో వ్యవసాయ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి వి.సురేంద్రబాబు ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు. తనిఖీల్లో ఎరువుల లైసెన్స్‌లో నమోదు కాని ఫారం-ఓలకు సంబంధించిన రూ. 2,78,000ల విలువైన అమ్మకాలను నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా ఏవో సురేంద్రబాబు మాట్లాడుతూ మండలంలోని రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రైవేటు ఎరువుల డీలర్లు, ఆర్‌బికేల్లో ఎరువులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రైవేటు ఎరువుల డీలర్ల ఎవరైన అధిక ధరకు విక్రయిస్తే మండల వ్యవసాయ అధికారి, సెల్ నెం. 8331056942 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు.

సీవీ కృష్ణయ్యకు ఘననివాళి

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని విష్ణుకుండినగర్‌లో విశ్రాంత తెలుగు పండిట్ సీవీ కృష్ణయ్య సంస్మరణ సభ గురువారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ యువనాయకులు బొల్లా గిరిబాబు సంస్మరణ సభలో పాల్గొని కృష్ణయ్య మాస్టార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఆయన వద్ద చదువుకున్న శిష్యులు, పట్టణ ప్రముఖులు పాల్గొని సీవీ కృష్ణయ్యకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాస్టారి సేవలను కొనియాడారు.















5న జాతీయ ప్రతిభా ఉపకార వేతన పరీక్షలు

శావల్యాపురం: జాతీయ ప్రతిభా ఉపకార వేతన పరీక్షలు (ఎన్ఎంఎంఎస్) ఆదివారం నరసరావుపేట పట్టణంలో ప్రభుత్వం ఎంపిక చేసిన పాఠశాలల్లో జరుగుతాయని శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాలాది శ్రీనివాసరావు గురువారం తెలిపారు. మండలంలోని ఐదు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈపరీక్షలు రాయనున్నట్లు చెప్పారు.



ప్రతి ఇంటికీ సంక్షేమం

● అన్ని వర్గాల్లో సంతోషం ● వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



సంక్షేమ పథకాల అమలుపై లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని

నాదెండ్ల: నవరత్నాలతో ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని చేకూర్చి అన్ని వర్గాల్లో సంతోషం నింపిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర ప్రజలు మరింత అండదండగా నిలవాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. నాదెండ్ల మండలం గొరిజవోలు గ్రామంలో గురువారం రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు అమలౌతున్న తీరును ప్రజలతో మమేకమై తెలుసుకున్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు, విద్యార్థులు, యువతను పలకరిస్తూ ప్రభుత్వ పనితీరుపై వారి అభిప్రాయాలు తెలుసుకుంటూ, ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కార్యక్రమాన్ని సాగించారు. గడప గడపకు వెళ్లి ప్రజలను కలిసి మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలో కనీవినీ రీతిలో సంక్షేమ పథకాలు అమలౌతున్నాయన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను, అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచి అమలు చేసి చూపించిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొర్రెపాటి గృహలక్ష్మి, ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, ఎంపీటీసీ గేరా సుహాసిని, మార్కెట్ యార్డు ఛైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, నాదెండ్ల సొసైటీ ఛైర్మన్ సింగారెడ్డి కోటిరెడ్డి, నాయకులు మద్దూరి కోటిరెడ్డి, కురుగుంట్ల వెంకట రెడ్డి, రఘురామి రెడ్డి, పర్వతనేని బ్రహ్మయ్య, అల్లడి రవికుమార్, గొంటు ప్రభాకరరెడ్డి, అంకిరెడ్డి, బత్తుల సీతారామిరెడ్డి, టీజే రత్తయ్య, సూరారెడ్డి, బొల్లయ్య పాల్గొన్నారు.

మాచవరంలో రీసర్వేని పరిశీలించిన జేసీ



సర్వే జరుగుతున్న తీరును పరిశీలిస్తున్న జేసీ శ్యామ్‌ప్రసాద్

రొంపిచర్ల: మండలంలోని మాచవరం గ్రామంలో నిర్వహిస్తున్న రీసర్వే పనులను జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ గురువారం సమీక్షించారు. సర్వే నిర్వహిస్తున్న తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. సర్వే వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే గ్రామంలోని సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆర్‌బీకే ద్వారా రైతులకు అందుతున్న సేవలపై సమీక్షించారు. ఎరువులు, పురుగుమందుల రేట్లను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అంకారావు, మండల సర్వేయర్ భాగ్యలక్ష్మి, వీఆర్వో, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.









నేడు మండల పరిషత్ ఉపాధ్యక్షుని ఎన్నిక

నరసరావుపేట రూరల్: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నేటి ఉదయం 11 గంటలకు మండల పరిషత్ ఉపాధ్యక్షుని పదవికి ఎన్నిక నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ ప్రిసైడింగ్ అఫీసర్, ఎంపీడీవో వి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించే ప్రిసైడింగ్ అధికారి సమక్షంలో నిర్వహించే ఎన్నికలో ఎంపీటీసీ సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.



